మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

- ఆయన ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం
- విమానంలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ మాజీ ఎమ్మెల్యే

హైదరాబాద్ శంషాబాద్ రూరల్, మే 14 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న ఇండిగో విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో అప్రమత్తమైన పైలట్ రన్‌వే పైనే నిలిపివేశారు. ఈ విమానంలో మంత్రితో పాటు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డితోపాటు మొత్తం 106 మంది ప్రయాణికులు ఉన్నారు. సాంకేతిక లోపాన్ని సరిదిద్దిన అనంతరం విమానం యథావిధిగా టేకాఫ్ అయింది. ఎయిర్‌పోర్ట్ అధికారుల వివరాల ప్రకారం ఇండిగో 6ఏ6707 విమానం మంగళవారం ఉదయం 7.40కి శంషాబాద్ నుంచి కొచ్చికి వెళ్లాల్సి ఉంది. అయితే టేకాఫ్ అయ్యే సమయంలో విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్టు గుర్తించారు. సమస్యను పరిష్కరించిన తర్వాత 11 గంటలకు విమానం టేకాఫ్ అయింది. ఇండిగో తీరుపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా చెక్ చేయకుండా విమానాన్ని ఏ విధంగా పంపిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులంటూ నిలదీశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరి వెళ్తున్నట్టు తెలిపారు. పొంగులేటి తన వర్గం నేతలతో కేరళ టూర్‌కు వెళ్లినట్టు తెలిసింది. నేడో రేపో మరికొంత మంది నేతలు పొంగులేటిని కేరళలో కలుసుకోనున్నట్టు సమాచారం.

పట్టభద్రుల సమరానికి సై

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ స్థానానికి 27న పోలింగ్
- బరిలో 52 మంది అభ్యర్థులు
- లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ప్రచారంపై పార్టీల దృష్టి
- తొలినుంచీ బీఆర్ఎస్‌కు కంచుకోట
- ఇప్పటివరకు అన్ని ఎన్నికల్లోనూ గులాబీదళందే విజయం
- ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజీనామాతో ఉప ఎన్నిక

వరంగల్, మే 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నిక సందడి మొదలైంది. ఈ నెల 27న పోలింగ్ జరుగనున్నది. జూన్ 5న కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. సోమవారంతో లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో అన్ని రాజకీయ పార్టీల దృష్టి ఈ ఉప ఎన్నికపై పడింది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది మంది అభ్యర్థులు నిలిచారు. 12 జిల్లాలు, 34 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఉన్నది. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్ పోటీలో ఉన్నారు. గ్రాడ్యుయేట్స్ ఉప ఎన్నిక ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. లోక్‌సభ పోలింగ్ ముగిసిన నేపథ్యంలో బుధవారం నుంచి ఉప ఎన్నిక ప్రచారం జోరందుకునే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ నియోజకవర్గంలో మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,87,007 మంది పురుషులు, 1,74,794 మంది మహిళలు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు. నియోజకవర్గ పరిధిలో 600 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు.

గులాబీ కోట

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం మొదటి నుంచి బీఆర్ఎస్‌కు బలమైన స్థానంగా ఉంటున్నది. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో జరిగిన ప్రతి ఎన్నికలోనూ బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఏర్పాటు కోసం 2007లో జరిగిన మొదటి ఎన్నికలో ఇక్కడి నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ గెలిచారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు కూడా రాజీనామా చేయగా, 2009లో జరిగిన ఉప ఎన్నికలోనూ బీఆర్ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ రెండోసారి విజయం సాధించారు. ఆయన పదవీ కాలం పూర్తి కావడంతో 2015 మార్చిలో ఎమ్మెల్సీ నియోజకర్గానికి సాధారణ ఎన్నిక జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఈ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిచారు. 2021 జరిగిన ఎమ్మెల్సీ సాధారణ ఎన్నికల్లోనూ పల్లా రెండోసారి విజయం సాధించారు. అయితే, గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్నది.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
సిద్దిపేట	3,118	1,553	00	4,671
జనగామ	14,862	8,457	01	23,329
హనుమకొండ	25,608	17,875	00	43,483
వరంగల్	26,907	16,687	00	43,594
మహబూబాబాద్	22,842	11,917	00	34,759
ములుగు	6,558	3,679	00	10,237
జయశంకర్‌భూపాలపల్లి	7,956	4,504	00	12,460
భద్రాద్రి కొత్తగూడెం	22,486	17,412	00	39,898
ఖమ్మం	50,517	33,085	04	83,606
యాదాద్రి భువనగిరి	20,740	13,186	00	33,926
సూర్యాపేట	34,043	17,250	00	51,293
నల్లగొండ	51,370	29,189	00	80,559
మొత్తం	2,87,007	1,74,794	05	4,61,806

కాంగ్రెస్ పార్టీలో అన్నీ నేనే..

- నా స్థాయిని తగ్గించాలని చూస్తే బుద్ధిచెబుతా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ ఫారాలు ఇచ్చేది నేనే
- నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలన్నీ నేనే చూస్తా
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టీకరణ

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, మే 14 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీలో తన స్థాయిని తగ్గించాలని చూసే వారికి సందర్భం వచ్చినప్పుడు బుద్ధి చెబుతానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. తమ పార్టీకి చెందిన కొందరు నేతలు కావాలనే తనపై విషం కక్కుతున్నారని, వీటినన్నింటినీ ఏఐసీసీ పరిశీలకులతోపాటు ఇంటెలిజెన్స్ వంటి సంస్థలు పసిగడుతున్నట్టు తెలిపారు. మంగళవారం ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొందరు కడుపులో కత్తులు పెట్టుకొని తిరుగుతున్నారని, ఎవరెన్ని చేసినా నియోజకవర్గ కాంగ్రెస్‌కు సంబంధించిన అన్ని బాధ్యతలు తానే చూసుకుంటానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఫారాలు తానే ఇస్తానని స్పష్టం చేశారు. పార్టీలో కర్త, కర్మ, క్రియ అన్ని తానేనని ప్రకటించుకున్నారు. అధికారం లేకుంటే ఉండలేని బ్యాచ్‌లను పార్టీలో కలుపుకొంటున్నారని, కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యత ఉండదని, ఎప్పటికీ కుళ్లు రాజకీయాలు చేయనని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున అభివృద్ధిపై దృష్టి పెడతానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి అధిక నిధులు రాబట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తానని తెలిపారు.

జాబ్ క్యాలెండర్ ఏమైంది?

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి
- లేదంటే ఊరుకొనే ప్రసక్తే లేదు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్

ఖైరతాబాద్, మే 14 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్‌ను రిలీజ్ చేస్తామని చెప్పి, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ విమర్శించారు. ఇప్పటివరకు ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా గుర్తించలేదని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీలకు సంబంధించిన సమాచార పత్రాలను తెలంగాణ ఉద్యమకారులు పృథ్వీరాజ్, విఠల్‌తో కలిసి జడ్సన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 డిసెంబర్ నాటికి ప్రభుత్వ శాఖల్లో 2,67,316 పోస్టులను ఖాళీగా ఉన్నట్టు గుర్తించామని, తాను ఎమ్మెల్సీగా గెలుపొందితే వీటన్నింటినీ భర్తీ చేసేదాకా పోరాడుతానని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారని, కాని సీఎం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ఊరుకోబోమని హెచ్చరించారు.

ఏపీలో ఆరని మంటలు

- పోలింగ్ ముగిసినా ఘర్షణలు
- తిరుపతిలో టీడీపీ అభ్యర్థిపై వైసీపీ కార్యకర్తల దాడి
- భద్రతా సిబ్బందికి గాయాలు

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినా టీడీపీ, వైసీపీ ఘర్షణలతో ఆంధ్రప్రదేశ్ అట్టుడుకుతున్నది. ఇరుపార్టీల ఏజెం ట్లు, కార్యకర్తలపై భౌతిక దాడులు జరుగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి వస్తున్న చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో నాని భద్రతా సిబ్బందికి గాయాలుకాగా, కారు ధ్వంసమైంది. తిరుపతిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీచార్జీ చేశారు. దాడిని నిరసిస్తూ టీటీడీ నేతలు వర్సిటీ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం వేల్పూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య వివాదం చెలరేగింది. సోమవారం రాత్రి పోలింగ్ బూత్ వద్ద ఘర్షణ జరుగగా మంగళవారం ఉదయం ఇరువర్గాలు కొట్లాడుకున్నారు. శావల్యాపురం మండలం పేరూరుపాడులో టీడీపీ నేతల కార్లను వైసీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. చిత్తూ రు జిల్లా బైరెడ్డిపల్లి మండ లం బాపలనత్తంలో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ వర్గీయులు కత్తులు, రాళ్లతో దాడిచేశారు. ఓ వ్యక్తికి తీవ్ర గాయా లు కావడంతో తిరుపతిలోని దవాఖానకు తరలించారు. అనంతపురం జిల్లా కొత్తూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు పరస్పరం దాడుల్లో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని తెల్లకూరులో గర్భిణిపైనా దాడి జరిగింది. రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పంచాయతీ పరిధి బూరుగుమాకులపల్లెలో డ్రిప్ పరికరాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు.

పల్నాడు ఉద్రిక్తం

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా కారంపూడి మండల కేంద్రంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలోని తమ కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసినట్టు టీడీపీ నేతలు ఆరోపించారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాడి జరిగిందని పేర్కొంటున్నారు. స్థానికంగా భయాందోళన పరిస్థితులు తలెత్తడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ ఇండ్లకే పరిమితమయ్యారు.

'గ్రాడ్యుయేట్' సమరానికి బీఆర్ఎస్ సన్నద్ధం

- నేడు నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల ముఖ్య నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- ప్రచార వ్యూహంపై దిశా నిర్దేశం

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఉప ఎన్నికకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. ఇప్పటికే నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. ఈ నెల 27న పోలింగ్ జరగనున్నది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏ రాకేశ్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీ పూర్తిస్థాయిలో గ్రాడ్యుయేట్ ఎన్నికపై దృష్టి సారించడం సాధ్యపడలేదు. లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో అనుసరించాల్సిన వ్యూహంపై బుధవారం ఉదయం తెలంగాణభవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నారు. సమావేశానికి మూడు జిల్లాల నుంచి ముఖ్య నాయకులను ఆహ్వానించారు. వీరికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తదితర నేతలు పార్టీ ఎన్నికల ప్రచారణ ప్రణాళిక, వ్యూహంపై దిశా నిర్దేశం చేయనున్నారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. నల్లగొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ స్థానం ఏర్పడిన నాటి నుంచి నేటివరకు వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుస్తూ వస్తున్నారు. ఈసారి కూడా గెలిచి పట్టు నిలబెట్టుకోవాలన్న పట్టుదల ఆ పార్టీ నేతల్లో కనిపిస్తున్నది. గతంలో అధికారంలో లేని సమయంలోనూ ఇక్కడ గెలిచామని, పార్టీ అభ్యర్థి గెలవడానికీ, అధికారానికీ సంబంధంలేదని పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీ ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి పకడ్బంది వ్యూహంతో ముందుకెళ్తున్నది. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు, ఉద్యోగులకు చేసిన మోసాలు, టీఎస్‌పీఎస్సీ జాబ్ క్యాలెండర్‌ను అమలుచేయకపోవడం, ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉండటం, కొత్త నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం, నిరుద్యోగ భృతిపై మాట మార్చడం తదితర అంశాలను ప్రచార అస్త్రాలుగా సంధించనున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

కాంగ్రెస్‌లో టూరిజం!

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడంతో వీలైనన్ని ఎక్కువ స్థానాలు సాధించాలని భావించింది. ఈ నేపథ్యంలో ఎన్నికలు ముగిసిన తర్వాత పీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై సమీక్షించుకోవాల్సిన మంత్రులు అదేమీ పట్టించుకోకుండా ఎవరికి వారు తలో దారిన వెళ్లడం పార్టీ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికలను సీరియస్‌గా తీసుకోని భట్టి

పార్లమెంట్ ఎన్నికలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అంత సీరియస్‌గా తీసుకోలేదని చెప్తున్నారు. ఖమ్మం ఎంపీ టికెట్‌ను తన భార్య నందినికి ఇప్పించుకునేందుకు చివరివరకు ప్రయత్నించి ఆయన భంగపడ్డారు. ఇది ఆయనను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఈ కారణంగానే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మొక్కుబడిగా పాల్గొన్నారు. సొంత జిల్లా ఖమ్మంలో ఎన్నికల ప్రచారాన్ని గాలికి వదిలేసి కేరళ, ఒడిశా వెళ్లి అక్కడ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. ఇదే జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అయితే ఖమ్మం ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని అసలు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఒక్కరే పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ప్రచారాన్ని తన భుజాలపై వేసుకొని ప్రచారం చేశారు. తమను కాదని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన వియ్యంకుడు రామిరెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకోవడంతో గెలిపించుకునే బాధ్యత కూడా మీదేనని భట్టి, తుమ్మల చేతులు ఎత్తేశారు. తాజాగా ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), ఆదినారాయణ (అశ్వారావుపేట), విజయబాబు తదితర ముఖ్య నేతలతో కలిసి పొంగులేటి కేరళ టూర్ వెళ్లడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ జిల్లాకు చెందిన మరికొందరు ఎమ్మెల్యేలు కూడా రేపో, మాపో వెళ్లి మంత్రి పొంగులేటితో టూర్‌లో జాయిన్ కానున్నట్టు సమాచారం. పొంగులేటి ఏ పార్టీలో ఉన్నా గ్రూప్‌లు నిర్వహిస్తారని.. వైసీపీ, బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు సొంత గ్రూపు ఏర్పాటు చేసుకున్నారని గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో అదేపని చేస్తున్నారని ఖమ్మం నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. జిల్లాలో భట్టి విక్రమార్కను కాదని తన ఆధిపత్యం పెంచుకునేందుకు ఎమ్మెల్యేలు అందరినీ పొంగులేటి కూడుగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్తున్నారు.

జోరందుకున్న ప్రచారం

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని ఇప్పటికే రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ సర్కారు ఎంతోకాలం ఉండదని బీజేపీ నాయకులు కూడా బాహాటంగానే చెప్తున్నారు. సీఎం సీట్లో నుంచి రేవంత్‌రెడ్డిని దించేందుకు ఖమ్మం, నల్లగొండ నాయకులు కాచుక్కూర్చున్నారన్న చర్చ కూడా జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పొంగులేటి తన మద్దతుదారులైన ఎమ్మెల్యేలతో టూర్‌కు వెళ్లడం జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరుస్తున్నది. పొంగులేటి వర్గం అలాంటిదేమీ లేదని, ఈ టూర్‌కు రాజకీయ ప్రాధాన్యమూ లేదని తేల్చి చెప్తున్నారు. టూర్ విషయమై సీఎంకు పొంగులేటి సమాచారమిచ్చారని పేర్కొన్నారు.

ఖమ్మం, నల్లగొండ నేతలపై నిఘా

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే తమ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్ర జరుగుతున్నట్టు రేవంత్ స్వయంగా పలు సభల్లో ఆరోపించారు. ఈ కుట్రలు పార్టీలో అంతర్గతంగా జరుగుతున్నవా? లేక కేంద్రంలోని బీజేపీ సహకారంతో జరుగుతున్నాయా? అనే చర్చకు దారితీసింది. అసలు రేవంతే కాంగ్రెస్‌లో ఏక్‌నాథ్‌షిండేగా మారి బీజేపీతో చేతులు కలిపే అవకాశం ఉందన్న వార్తలు కూడా వచ్చాయి. ఈ విషయాన్ని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి బాహాటంగానే స్టేట్‌మెంట్ ఇవ్వగా, పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి బీజేపీలోకి రావడం ఖాయమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ పలుమార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో పొంగులేటి టూర్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. తన ప్రభుత్వానికి ఖమ్మం, నల్లగొండ మంత్రుల నుంచే ముప్పు పొంచి ఉందన్న అనుమానంతో రేవంత్ ఈ రెండు జిల్లాల పార్టీ కీలక నేతలపై నిఘా పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. పార్టీ ముఖ్యనేతలతో పాటు ప్రతిపక్ష నేతల ఫోన్లను సీఎం ట్యాప్ చేయిస్తున్నారేమోనని బీజేపీ నాయకుడు రఘునందన్‌రావు ఇటీవల ఆరోపించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షకు డుమ్మా

పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఎన్నికలపై దృష్టి సారించాయి. ఈ ఎన్నికలపై పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం జిల్లాకు చెందిన కీలక నేతలు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరూ డుమ్మాకొట్టడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది.

రేవంత్‌రెడ్డి ఇలాకాలో కాంగ్రెస్‌కు రిక్తహస్తం?

- మహబూబ్‌నగర్‌లో 2 లక్షల మెజార్టీ సాధిస్తా
- మీడియా ముందు బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ధీమా
- స్వల్ప మెజార్టీపై కాంగ్రెస్‌లో దింపుడు కల్లం ఆశ
- సిట్టింగ్ సీటు మల్కాజిగిరిలోనూ ఇదే పరిస్థితి
- ఓటింగ్ సరళిపై కాంగ్రెస్‌లో ఊహాగానాలు

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని, ఈ ఫలితాలు తమ పాలనకు రెఫరెండంగా భావిస్తామని ప్రకటించిన పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో కాంగ్రెస్‌కి పార్టీ రిక్త హస్తం తప్పదని పరిశీలకులు భావిస్తున్నారు. రేవంత్ సొంత జిల్లా మహబూబ్‌నగర్‌తో పాటు ఆయన సిట్టింగ్ సీటు మల్కాజిగిరిలో సైతం కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం లేదన్న చర్చ జరుగుతున్నది. ఇదే జరిగితే ఫలితాల అనంతరం రేవంత్‌రెడ్డికి సొంత పార్టీలోనే గడ్డుపరిస్థితి ఎదుర్కోక తప్పదని అంటున్నారు. సీఎం పదవిని ఆశిస్తున్న ఖమ్మం, నల్లగొండ నాయకులు ఈ ఎన్నికల్లో ఇంట గెలిచి సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసరబోతున్నారని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ సీటును, సిట్టింగ్ సీటు మల్కాజిగిరిని రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన పలు సందర్భాలలో ప్రస్తావిస్తూ తనను రాజకీయంగా దెబ్బతీయడానికి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు కుట్ర జరుగుతున్నట్టు ఆరోపించారు. ఆయన అనుమానించినట్టే మహబూబ్‌నగర్, మల్కాజిగిరి సీట్లలో ఫలితాలు కాంగ్రెస్‌కు ఆశాజనకంగా లేవనీ పార్టీ లోపలా, బయటా బలంగా వినిపిస్తున్నది. మహబూబ్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించడానికి రేవంత్‌రెడ్డి తన సర్వశక్తులు ఒడ్డారు. ఏకంగా ఎనిమిది పర్యాయాలు అక్కడ ఎన్నికల ప్రచార సభలకు, రోడ్‌షోలకు హాజరయ్యారు. రాష్ట్రంలో మరే నియోజకవర్గంలోనూ ఇన్నిమార్లు ఆయన పర్యటించలేదు. తన రాజకీయ భవిష్యత్తు మహబూబ్‌నగర్ స్థానం ఫలితంతో ముడిపడి ఉండటంతో, ఈ నియోజకవర్గం పరిధిలోని మక్తల్ అసెంబ్లీ స్థానంలో అత్యధిక మెజార్టీ సాధిస్తే.. ఆగస్టు 15 కల్లా స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తానని ప్రకటించారు. మక్తల్, నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి నుంచి బీజేపీకి కొంత సానుకూలత ఉండటంతో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు మంచి మెజార్టీ వస్తుందని అంచనా వేశారు. దీంతో ఆ అవకాశాలను దెబ్బతీసేందుకు రేవంత్‌రెడ్డి మంత్రి పదవిని ఎర వేసి ఉంటారని పార్టీ వర్గాలలో చర్చ జరిగింది. దీనికితోడు మహబూబ్‌నగర్ నియోజకవర్గం పరిధిలో ముదిరాజ్ సామాజికవర్గం జనాభా కూడా ఎక్కువే. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అదే సామాజికవర్గానికి చెందినవాడు కావడంతో.. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే.. మంత్రివర్గంలో ముదిరాజ్‌లకు స్థానం కల్పిస్తానని కూడా రేవంత్ వాగ్దానం చేశారు.

రేవంత్‌కు ఇబ్బందులు తప్పవా?

రేవంత్‌రెడ్డి ఇన్ని రీతులుగా ఎత్తులు వేసినప్పటికీ పోలింగ్ తర్వాత ఓటింగ్ సరళిని బట్టి బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు విజయావకాశాలు మెండుగా ఉన్నట్టు విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. డీకే అరుణ మహబూబ్‌నగర్‌లో మంగళవారం ప్రెస్‌మీట్ పెట్టి తాను రెండు లక్షల మెజార్టీతో గెలువబోతున్నట్టు ప్రకటించడ కూడా సీఎం రేవంత్‌రెడ్డి శిబిరంలో పార్టీ విజయావకాశాలపై నమ్మకం సన్నగిల్లేలా చేసింది. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ వర్గాలు కూడా తాము స్వల్ప మెజార్టీతోనైనా గట్టు ఎక్కుతామంటూ దింపుడు కల్లం ఆశను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల డ్యూటీకి వెళ్లిన ఉద్యోగులు కూడా ఇక్కడ బీజేపీ అభ్యర్థి గెలిచేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారని కాంగ్రెస్ వర్గాలలో చర్చ జరుగుతున్నది. ఇక మల్కాజిగిరి స్థానంలో కూడా కాంగ్రెస్ అభ్యర్థి గెలిచే అవకాశం లేదని, ఇది కూడా సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయంగా మరొక ఇబ్బందికరమైన పరిస్థితిగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మల్కాజిగిరి నుంచి సునీతా మహేందర్‌రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా బరిలోకి దించారు. వాస్తవానికి ఆమె చేవెళ్ల టికెట్ ఆశించగా, మల్కాజిగిరి తన సిట్టింగ్ సీటు కావడంతో గెలిపించే బాధ్యత తనదేనని ఒప్పించినట్టు సమాచారం. కానీ ఓటింగ్ సరళినిబట్టి ఇక్కడ కూడా కాంగ్రెస్‌కు విజయావకాశాలు చాలా తక్కువగా ఉన్నట్టు పార్టీ వర్గాలలో చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పార్టీలో అంతర్గతంగా ముమ్ముందు గడ్డుపరిస్థితి తప్పదని అటు కాంగ్రెస్ వర్గాలలో, ఇటు రాజకీయ వర్గాలలో హాట్‌హాట్ చర్చ జరుగుతున్నది.

రవాణాశాఖ చెక్ పోస్టులు రద్దు!

- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 చెక్‌పోస్టులు
- వీటిల్లో పనిచేసే ఉద్యోగులను హైదరాబాద్, జిల్లాల్లో వినియోగించుకోవాలని నిర్ణయం
- కోడ్ ముగియగానే అధికారికంగా అమలు

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రవాణాశాఖ చెక్ పోస్టులను శాశ్వతంగా రద్దు చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటిపై ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో రవాణాశాఖకు మొత్తం 15 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఇందులో వాంకిడి, అలంపూర్, కృష్ణా, సాలూర, ఆదిలాబాద్, జహీరాబాద్, మద్నూర్, భైంసా, నాగార్జునసాగర్, విష్ణుపురం, కోదాడ, కల్లూరు, అశ్వారావుపేట, పాల్వంచ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నాయి. మరొకటి కామారెడ్డిలో ఉన్నది. వీటిల్లో ఒక్కో చోట 10-15 మంది అంటే 150 మందికిపైగా అధికారులు, ఉద్యోగులు ఉంటారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలు, పర్మిట్లను చెక్‌పోస్టుల్లో తనిఖీ చేయాలి. ఇవి అవినీతి కేంద్రాలుగా మారాయన్న ఆరోపణలు దశాబ్దాలుగా ఉన్నాయి. ఒక్కో చెక్‌పోస్టు దగ్గర పర్మిట్ లేని వాహనాల నుంచి నామమాత్రపు జరిమానాలే విధిస్తున్నారు. రాష్ట్రంలోకి వచ్చాక జిల్లాల్లో అంతకు ఎన్నో రెట్లు జరిమానా వసూలవుతున్నట్టు తెలుస్తున్నది. దేశవ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చిన నేపథ్యం, రవాణా పర్మిట్లు సహా వాహనాల అనుమతులు ఆన్‌లైన్‌లోనే ఇస్తున్నారు. ఈ క్రమంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో రవాణాశాఖ చెక్ పోస్టులు అవసరం లేదని కేంద్రం గతంలోనే సర్క్యులర్ జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి పెట్టింది. ఎన్నికల కోడ్ రావడానికి ముందు ఉన్నతాధికారులు చెక్‌పోస్టుల తొలగింపుపై సర్కార్‌కు ప్రతిపాదనలు పంపినట్టు తెలుస్తున్నది. చెక్‌పోస్టుల్లో పనిచేసే ఉద్యోగులను జిల్లాలు, హైదరాబాద్‌లో వినియోగించుకోవాలని రవాణాశాఖ భావిస్తున్నట్టు సమాచారం.

యూజర్ చార్జీల ఆదాయం రవాణాశాఖకే

రవాణాశాఖ వాహనదారుల నుంచి లైఫ్ ట్యాక్స్‌తో పాటు యూజర్ చార్జీలను కూడా వసూలు చేస్తున్నది. ఏటా ఈ మొత్తం రూ.130 కోట్ల వరకు వస్తున్నది. రవాణాశాఖకు హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భవనాలు సరిగా లేవని, కొత్త భవనాలు, కంప్యూటర్లు వంటి అవసరాలకు నిధులు కావాలని ఆశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల కోడ్‌కి ముందు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. యూజర్ చార్జీల ఆదాయాన్ని కొత్త భవనాలకు ప్రతిపాదించగా సర్కారు ఆమోదం తెలిపినట్టు తెలిసింది. ఎన్నికల కోడ్ ముగిశాక అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి.

కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
CONTAINER CORPORATION OF INDIA LTD.
ఇది ఒక నవరత్న కంపెనీ (భారత ప్రభుత్వం యొక్క ప్రణాళిక)
A Navratna Company (A Govt. of India Undertaking)
CONCOR | Tele MANAS

నంబర్. ఎంఎస్‌టీసీ /ఏరియా-III/కాన్‌కార్/చెన్నై/24-25/1 తేదీ 15.05.2024

ఆన్‌లైన్ పబ్లిక్ వేలం విక్రయం

ఏరియా-III (దక్షిణ)లో వివిధ కాన్‌కార్ టెర్మినల్స్‌లో అందుబాటులో ఉన్న సమ్మతి పొందని/క్లెయిమ్ చేయబడని దిగుమతి చేయబడిన కార్గో, హాని చెందిన డొమెస్టిక్ కంటైనర్స్ /కార్గో ఆన్‌లైన్‌లో విక్రయించడానికి కాన్‌కార్ ఆహ్వానిస్తోంది. ఇంపోర్టర్/ కన్‌సైనీకి ఏదైనా తదుపరి నోటీసు ఇవ్వకుండానే కస్టమ్స్ చట్టం, 1962లో సెక్షన్ 48లో ఏర్పాట్ల ద్వారా ఇంపోర్ట్ కార్గో కోసం ప్రజా వేలం నిర్వహించబడింది. సరుకుల విక్రయం గురించి అప్పీలు ద్వారా లేదా గౌరవనీయమైన న్యాయస్థానంతో ప్రమేయమున్న ఏదైనా చెల్లుబాటయ్యే అభ్యంతరాలు ఉంటే ఈ నోటీసు వెలువడిన 7 రోజుల లోగా కాన్‌కార్‌కు సమర్పించవచ్చు. లేదంటే ఇంపోర్టర్/కన్‌సైనీకి ఎలాంటి అభ్యంతరం లేదని మరియు వస్తువులను ఎలాంటి నోటీసు లేకుండానే విక్రయించవచ్చని భావించబడుతుంది. ఎం/ఎస్ కాన్‌కార్ కోసం అధీకృత ఈ-కామర్స్ సర్వీస్ ప్రొవైడర్ ఎం/ఎస్ ఎంఎస్‌టీసీ లిమిటెడ్ ద్వారా ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించబడింది. సంబంధిత కాన్‌కార్ టెర్మినల్స్‌లో పని దినాలు /గంటలలో 15.05.24 నుండి 28.05.24 వరకు కంటైనర్స్/కార్గో తనిఖీ జరుగుతుంది. ఆన్‌లైన్‌లో 29.05.2024న వేలం జరుగుతుంది. వివరాల కోసం దయచేసి www.concorindia.com కి లేదా eprocure.gov.in కి లేదా www.mstcindia.co.in కి లాగ్ ఆన్ చేయండి లేదా సంప్రదించండి కాన్‌కార్-044-26482192ని లేదా ఎంఎస్‌టీసీని సంప్రదించండి. ఫోన్: 044-25219004, ఈ-మెయిల్: mhjain@mstcindia.co.in ఇంకా, ఏదైనా సవరణలు ఉంటే, బిడ్స్ సమర్పించడానికి చివరి తేదీకి ముందు పైన చెప్పిన వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రదర్శించబడతాయి. కాబట్టి బిడ్డర్స్ వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా సందర్శించవలసిందిగా అభ్యర్థిస్తున్నాము.

సంతకం/-ఏరియా హెడ్-III (దక్షిణ)